

అణు ఒప్పందానికి వ్యతిరేకంగా గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగిన విపక్షాల ధర్నాలో వేదికపై మాట్లాడుకుంటున్న నారాయణ, చంద్రబాబు



అణు ఒప్పందానికి వ్యతిరేకంగా గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగిన విపక్షాల ధర్నాలో అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ కటౌట్‌తో వినూత్నంగా నిరసన తెలుపుతున్న ఓ కార్యకర్త

# అడ్డపంచెతో ఇంత మోసమా?

- వైఎస్ రైతు వ్యతిరేకి... • ఎరువుల దొంగనిల్వలతో కొరత
- కార్యకర్తలూ గిడ్డంగులపై దాడులు చేయండి: చంద్రబాబు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** "నేనూ రైతునే. ఈ సదస్సుకు హాజరైన మీరూ రైతులే. మీలోనూ చాలా మంది ఊర్లలో ప్యాంట్లు వేసుకుంటున్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ మాత్రం అడ్డపంచె కట్టి రైతుల్ని మోసగిస్తున్నాడు. ఢిల్లీలో మాత్రం సూటు వేస్తాడు. రైతు పాక్షపాతినంటూ...వారి పట్ల పక్షపాత బుద్ధితో వ్యవహరిస్తున్నారు. సెజ్‌ల కోసం 50వేల ఎకరాలను రైతుల నుంచి లాగేసుకున్నాడు. ఎవరిచ్చారు ఈ అధికారం? చరిత్రలో మొదటిసారిగా ఎరువుల కొరత సృష్టించి, దొంగ నిల్వలతో అమ్ముకుంటున్నారు. రైతుల వద్ద పంటలు ఉన్నప్పుడు ఒక ధర...రైతు అమ్మేశాక మరో ధరతో దోపిడీ చేస్తున్నారు. రైతు రుణాలు పూర్తిగా మాఫీ చేయలేదు. 5వేల మంది రైతులు ఈ కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ రైతు వ్యతిరేక, అవినీతి ప్రభుత్వంపై మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న పోరాటం ప్రారంభిస్తున్నాం. ఈ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు ఈ పోరాటం ఆగదు" **-తెదేపా అధినేత చంద్రబాబు**

ఎరువులు ఎక్కడ అక్రమంగా నిల్వచేసినా దాడి చేసి రైతులకు పంచాలని తెదేపా అధినేత చంద్రబాబు తమ పార్టీ నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దొంగ నిల్వలను బయటపెట్టేందుకు ప్రతి కార్యకర్తా ఒక నిఘా వ్యవస్థలా పనిచేయాలని సూచించారు. రైతాంగానికి సంపూర్ణ రుణ మాఫీ జరిగేంతవరకూ పోరాడతామన్నారు. రాష్ట్ర స్థాయిలో ధరల నిర్ణాయక సంఘాన్ని ఏర్పాటు చేస్తామని, అది సూచించిన మేరకు రైతాంగానికి మద్దతు ధరలు ఇస్తామని ప్రకటించారు. తెలుగు రైతు మేధోమథన సదస్సు గురువారమిక్కడ ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో జరిగింది. మానవ వనరుల విభాగం ఛైర్మన్ దాడి వీరభద్రరావు, తెలుగు రైతు నాయకులు ముత్యంరెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు, లక్ష్మీరెడ్డి, పొన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగించారు. కాంగ్రెస్ నాయకులు ఎరువుల దొంగ వ్యాపారం కూడా చేస్తున్నారని, పార్టీ ఎమ్మెల్యే దేవినేని ఉమామహేశ్వరరావు మూడుసార్లు గిడ్డంగుల్లోని నిల్వలను పట్టుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రతి కార్యకర్తా కనీసం ఒకసారైనా దొంగ నిల్వలను పట్టుకోవాలని పిలుపునిచ్చారు. "పత్తి ధర రైతు వద్ద ఉన్నప్పుడు క్వింటాలుకు రూ.1800ధర ఉండేది. వారు అమ్మేసుకున్నాక రూ.3000లు అయ్యింది. అలాగే ధాన్యం రైతుల వద్ద ఉండగా రూ.800. వారు అమ్మేశాక రూ.1200లు అయ్యింది. ప్రతి పంట పరిస్థితీ ఇంతే. రైతు దగ్గర ఉన్నప్పుడు ధర ఉండదు. అమ్మేశాక ధర పెరుగుతుంది. ఇది కాంగ్రెస్ పార్టీ మాయాజాలం"అని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే పగటిపూట 12గంటలపాటు ఒకే విడతలో ఉచిత విద్యుత్తు ఇస్తామని, వరికి వెయ్యిరూపాయల మద్దతు ధర చెల్లిస్తామని పునరుద్ఘాటించారు. మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తే...పరిశ్రమలు వాటంతటవే వస్తాయని, భూమినీ వారే కొనుగోలు చేస్తారని తాము భావించామని, కానీ వైఎస్ మాత్రం పేద ప్రజల నుంచి రూ.2లక్షలకు ఎకరం తీసుకున్నారని, తర్వాత అది కోటి రూపాయలు కావడంతో ఆ రైతులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. తెదేపాలో రెండుసార్లు రాజ్యసభ సీటు పొందిన వ్యక్తి ఒకరు, తొమ్మిదేళ్లు మంత్రి పదవి అనుభవించిన మరొకాయన, కుటుంబం మొత్తానికి పదవులిచ్చినా మరో వ్యక్తి పార్టీని వీడి వెళ్లిపోయారని, కానీ వీరందరినీ భుజంపై మోసిన కార్యకర్త మాత్రం తెదేపాతోనే ఉన్నాడని చంద్రబాబు అన్నారు. కార్యకర్తకు ఏం చేసేందుకైనా సిద్ధమని, అతని రుణం తీర్చుకోలేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీని గద్దె దించేందుకు ప్రతి కార్యకర్తా పట్టుదలగా పనిచేయాలని పిలుపునిచ్చారు.





గురువారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో జరిగిన రాష్ట్ర తెలుగు రైతు సదస్సులో ప్రసంగిస్తున్న తెదేపా అధినేత చంద్రబాబు